

కార్యకర్తలకు అండగా వైసిపి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కాశినాయన

వైసిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ బద్వేల్ ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి పేర్కొన్నారు ఆదివారం ఆయన మండల పరిధిలోని గంగనపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పెద్ద వెంకటరెడ్డి, నరసాపురం గ్రామానికి చెందిన కార్యకర్త వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలవల్ల ఇటీవల ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. వారిని ఎమ్మెల్సీ వారి స్వగ్రామాలకు వెళ్లి పరామర్శించారు వారికి ధైర్యం చెప్పి వైసిపి ఎప్పటికీ అండగా ఉంటుందని. తాను మీకు అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జెసిఎస్ సమన్వయకర్త గుండం హనుమంతరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కె.ఎల్. వెంకట్‌రెడ్డి, మిద్దెల జగన్మోహన్‌రెడ్డి, సిద్ధారెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుక పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఇసుక పంపిణీని నియమ నిబంధనల మేరకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈనెల 19 నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవడానికి సన్నద్ధత కోసం మరి ఇతర అంశాలపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాల యం నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్ సంబంధిత అధికా రులతో హాజర య్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్, డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఇసుక పంపిణీ విధానాన్ని నియమ నిబంధనల మేరకు సజావుగా పారదర్శకంగా పంపిణీ చేయాలని అన్నారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ విధానం సజావుగా పారదర్శకంగా జరిగేందుకు సంబం ధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇసుకను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకునేందుకు సన్నద్ధం కావాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా 19 నుంచి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వినియోగదారుడు ఇసుకను పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని ఇంటి వద్దకే ఇసుక అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సాండ్ మేనేజ్మెంట్ సిస్టంలో సెల్‌ఫోన్ ద్వారానే ఇసుకను బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. విని యోగదారులు ఇసుకను ఎలా బుక్ చేసుకోవాలా అన్న విషయంపై ఈనెల 17న సంబంధిత సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇస్తార్నని చెప్పారు. ఎలాంటి జాప్యం పొరపాటుకు తావి వ్వకుండా పారదర్శకంగా ఇసుక పంపిణీ జరగాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మైన్స్ అధికారులు విమలమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్ కడప ఆర్‌డిఒ వెంకటపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.75 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు
- పిఎంజిఎస్‌వై కింద 41 రకాల పనులకు శ్రీకారం
- పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.వి.శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టనుంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో రూ.75 కోట్లతో సిసిరోడ్లు, డ్రెయినేజీలు, బి.టిరోడ్లు, డబ్ల్యుబిఎం రహదారులను అభివృద్ధి పరచడానికి ప్రతిపాదనలు అందజేశాం. ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చింది. 2025 మార్చి నాటికి మౌలిక వసతుల కల్పనను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకెళు తున్నాం. జిల్లాలోని వేంపల్లి బ్రిడ్జిల ప్రారంభోత్సవానికి సిద్ధం చేశాం. సిరిగేపల్లి బ్రిడ్జి నిర్మాణానికి గండికోట బ్యాక్‌వాటర్ ముంపు సమస్య కారణంగా నిలిచిపోయింది. బ్యాక్ వాటర్ తగ్గు ముఖం పట్టిన నేపథ్యంలో పురోగతిపై ఆలోచన చేయాల్సి అవసరం ఏర్పడనుంది. జిల్లాలోని కడప మినహా మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మెరుగైన వసతుల కల్పనపై దృష్టి సారించామని పేర్కొంటున్న పంచాయతీరాజ్ సూప రింటెండింగ్ ఇంజినీర్ జి.వి.శ్రీనివాసులరెడ్డితో ముఖాముఖి..



ముఖా ముఖి..

జిల్లాలోని అభివృద్ధి పనుల గురించి తెలపండి?

జిల్లాలో రూ.75 కోట్ల వ్యయంతో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు అందజేశాం. ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం సిసిరోడ్లు, బి.టిరోడ్లు, డబ్ల్యుబిఎం రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున చేపడతాం. 2025 మార్చి నాటికి నిర్దేశిత పనుల్ని పూర్తి చేయడంపై దృష్టి సారించాం.

పిఎంజిఎస్‌వై పనుల పురోగతి ఎలా ఉంది?

పిఎంజిఎస్‌వై కింద చేపట్టిన 41 పనుల్లో రూ.116 కోట్లతో 32 రోడ్డు పనులు, తొమ్మిది బ్రిడ్జి పనులు ఉన్నాయి. రూ.91.50 కోట్లకు ఆమోదం లభించింది. పిఎంజిఎస్‌వై-2 కింద రూ.2,965.12 కోట్లు బ్రిడ్జి, ఇతర పనులు, 2021-21లో పిఎంజిఎస్‌వై-3 కింద రూ.10,525.71 కోట్లతో రహదారుల పనులు చేపట్టాం. 2023-2024లో పిఎంజిఎస్‌వై-3 కింద రోడ్లు, బ్రిడ్జి రూ.20,732 కోట్లతో 42 పనుల్లో 16 పనులు చేపట్టాం. మిగిలిన 25 పనులు టెండరు దశలో ఉన్నాయి. టెండరు పూర్తి చేసిన వెంటనే పనులు చేపడతాం.

ఇఎపి పనుల పురోగతిని వివరించండి?

జిల్లాలో ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ఫండ్స్ కింద రూ.6781.26 కోట్లతో 25 ప్యాకేజీలను చేపట్టాం. 142 ప్యాకేజీల్లో పనులు పూర్తి కాగా, 104 ప్యాకేజీలు పురోగతిలో ఉన్నాయి. 97 పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, రాయచోటిలో ఐదు ప్యాకేజీలు, పులివె ందులలో రెండు ప్యాకేజీలు టెండరు దశలో ఉన్నాయి.

సిరిగేపల్లి బ్రిడ్జి ప్రశ్నార్థకమేనా?

కొండాపురం-సిరిగేపల్లి బ్రిడ్జి పనులు తాత్కాలికంగా నిలిపేశాం. గండికోట జలాశయం బ్యాక్‌వాటర్ కారణంగా పురోగతి లేదు. వెనుక జలాలు తగ్గిన వెంటనే పనులను వేగవంతం చేస్తాం.

వేంపల్లి బ్రిడ్జి నిర్మాణ పనుల గురించి తెలపండి?

వేంపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశాం. గతేడాది పాపాఘ్ని నదికి వచ్చిన వరదల అనంతరం పనుల్ని వేగవంతం చేశాం. ఈ ఏడాది మార్చి నెలలోపు ఎప్పుడైనా బ్రిడ్జిని ప్రారంభించడానికి అవకాశం ఉంది.

క్రీడలు మానసికోల్లాసానికి మార్గాలు

- ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి


బహుమతులు ప్రదానం చేస్తున్న విద్యాశాఖాధికారి

ప్రజాశక్తి - కడప అర్బన్

మానసిక, శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని కడప డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్ లో జిల్లాస్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. నిరంతరం విద్యాబోధనలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీల నిర్వహణ మంచి ఆటవిడుపు లాంటిదన్నారు. ఉపాధ్యాయులకు మానసిక వికాసంతో పాటు, శారీరక శ్రమ కూడా అవసరమన్నారు. ఉపాధ్యాయులు విద్యా బోధనతో పాటు నిరంతరం ఆటలకు కొంత సమయాన్ని కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు. యుటిఎఫ్ కేవలం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలకే పరిమితం కాకుండా ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించి ఉపాధ్యాయులకు మానసికోల్లాసంతో పాటు శారీరక వికాసానికి కృషి చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ 50 ఏళ్ల యుటిఎఫ్ పోరాటాలు, విద్యారంగ విషయాలు, భవిష్యత్ కార్యాచరణలు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ తదితర విషయాలపై డిసెంబర్ 13, 14, 15, 16 తేదీల్లో కాకినాడలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను కన్నుల పండుగగా నిర్వహించి చర్చోప చర్చల ద్వారా రాబోయే 25 సంవత్సరాల పాటు సంఘ నిర్మాణంపై దృష్టి పెడతామని చెప్పారు. ప్రభుత్వ విద్యారంగాన్ని వృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలైన ఉపాధ్యాయులందరికీ అక్టోబర్ 4 నుంచి 6 వరకు గుంటూరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి అక్కడ విజేతలైన వారికి కాకినాడలో నిర్వహించబోయే స్వర్ణోత్సవ మహాసభలో బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్‌తో పాటు పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప

విద్యుత్ ఉద్యోగులందరూ విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. ఇంజినీర్స్‌డే పురస్కరించుకొని ఆదివారం ప్రఖ్యాత సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి, విద్యుత్ భవన్‌లో చిత్రపటానికి జిల్లా విద్యుత్ శాఖ అధికారి, ఇంజనీర్లు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం ప్రపంచ ప్రఖ్యాతి ఇంజినీర్లలో అతి ముఖ్యుడని పేర్కొన్నారు. ఆయన అసలు పేరు విశ్వేశ్వరాయ, అందరూ విశ్వేశ్వరయ్య అని ప్రేమగా పిలిచేవారు అని అన్నారు. ఇంజినీరింగ్ విద్యను విజయవంతంగా పూర్తిచేసుకున్న తరువాత, మొదటిసారిగా బొంబాయిలో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారని, ఆ సమయంలో బొంబాయిని ఒక సుందర నగరంగా తీర్చిదిద్దారని చెప్పారు. రోజుకు 18 గంటలు పనిచేయడం ఆయనకు నిత్యకృత్యమని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న విద్యుత్ ఎస్ఇ రమణ

గంజికుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంజినీర్లకు ఘన సన్మానం

ఇంజనీర్స్ డే సందర్భంగా గంజికుంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంజినీర్లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలి యజేశారు. భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163 వ జయంతి సందర్భంగా కడప నగరం స్థానిక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ లోకల్ సెంటర్ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఇంజనీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సెంటర్ నుంచి విశ్వేశ్వరయ్య విగ్రహం వరకు లోకల్ సెంటర్ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, సెక్రటరీ వెంకటేశ్వరరావు, గంజికుంట ఫౌండేషన్ అధినేత రవీంద్రనాథ్, గంజికుంట గణేష్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఇంజినీర్లు, మునిసిపల్ లైసెన్స్ ఎడ్స్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఐఇఐఎల్‌సి సమావేశం నిర్వహించారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. సన్మాన గ్రహీతల్లో ఎపిఎస్‌ఇబి విశ్రాంత సిఇ మోహన రామిరెడ్డి, ఇంజినీర్లు బి టి. ప్రసాద్, గోపాల్, జి గౌరీ శంకర్, వి.రామచంద్రారెడ్డి, వి. వేణుగోపాల్ రెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, బ్రహ్మానందరెడ్డి, కర్నాటి చంద్రశేఖర్ రెడ్డి, టి.కిషోర్ కుమార్ ఉన్నారు.



సన్మానం పొందిన వివిధ శాఖల ఇంజినీర్లు

మహా మేధావి 'మోక్షగుండం' : తులసిరెడ్డి

వేంపల్లె : నేటి ఆధునిక భారతావనికి ఇంజినీరింగ్ పునాదులు వేసిన మహా మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని వేంపల్లెలోని కాంగ్రెస్ కార్యాలయంలో మోక్షగుండం చిత్ర పటానికి ఘనంగా నివాళ్ళర్పించారు. అలాగే రోడ్డు భవనాల శాఖ అతిథి గృహం ఆవరణంలో ఉన్న మోక్షగుండం విగ్రహనికి టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, గాలి హరిప్రసాద్ నివాళులర్పించారు. ఈసందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ మోక్ష గుండంకు ప్రతి ఆలోచనా జాతి నిర్మాణం పైనే ఉండేదని చెప్పారు. నిబద్ధత, సమయపాలన, అంకితభావానికి మోక్షగుండం మారు పేరు అన్నారు. ఆర్థిక వ్యవస్థలో రెండు కీలక అంశాలైన ఆనకట్టలు, పరిశ్రమలకు ఊపిరులూదిన గొప్ప దార్శనికుడు అన్నారు. బెంగళూరుకు సమీ పంలో కొండల మధ్య ఉన్న ఒక చిన్న గ్రామమైనా ముద్దనహళ్లిలో 1861 సెప్టెంబర్ 15న తెలుగు కుటుంబంలో విశ్వేశ్వరయ్య జన్మించారని చెప్పారు. విశ్వేశ్వరయ్య పుణెలోని కాలేజ్ ఆఫ్ సైన్స్, సివిల్ ఇంజినీరింగ్ చదివి అత్యున్నత స్థానంలో నిలిచినట్లు చెప్పారు. వేరు వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, అమర్నాథ్‌రెడ్డి, సుబ్బరాయుడు, నాగరాజు, మహబూబ్ బాషా (మాస్), ఎఇ వెంకట రమణయ్య, ఎన్‌డిఎ నాయకులు సుమన్, వీరబద్ర, ఈశ్వర్ రెడ్డి, మల్లికార్జున, వినోద్‌రెడ్డి, శ్యామ్, నరేంద్ర బాబు, దేవా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ ఇక్బాల్

ఉర్దూ స్కూలు కాంప్లెక్స్‌లను కొనసాగించండి

రూట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్‌జిటి ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను యథావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలలోనే కొనసాగించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ కోరారు. ఆదివారం నగరంలోని సంఘ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ విద్యాశాఖాధికారుల హడావుడి నిర్ణయాలతో ఉపాధ్యాయ సర్దుబాటులో ఉర్దూ పాఠశాలలకు లాభం కన్న నష్టం ఎక్కువ చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్‌లకు ఇతర మీడియాలలో కలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రధాన సలహాదారులు డాక్టర్ ఎన్. అయ్యూబ్ హుసేన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1997లో ఉర్దూ స్పెషల్ డిఎస్‌సి నిర్వహించి ఉర్దూ విద్యా వ్యవస్థకు ఊపిరి పోశారని తెలిపారు. మళ్లీ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీ గా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్ సాహెబ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు 2001 సంవత్సరంలో రోష్ని పథకం ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించారని పేర్కొన్నారు. ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు రెండు సెకండరి గ్రేడ్ టీచర్ల పోస్టులు మంజూరు చేసి ఉర్దూ పాఠశాలల మనుగడకు పునాది వేశారని చెప్పారు. మళ్లీ రోష్ని పథకం పునఃప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా కనీసం 500 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర డైరీ కమిటీ కో చైర్మన్ సయ్యాద్ సిరాజుద్దీన్, రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర నాయకులు యూనుస్ తయ్యిబ్, షహాబుద్దీన్, ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీ విజేతగా నిలిచిన వినూత్

ప్రజాశక్తి - కడప

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 21వ అశ్రప్ ప్రసన్న మంత్లీ రూలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్‌లో విజేతగా వినూత్ నిలిచాడు. ద్వితీయ స్థానంలో రెడ్డిపవన్, తృతీయ స్థానంలో అనురాగ్ నిలిచారు. తరువాతి స్థానాల్లో ప్రభుదేవా, కరీముల్లా, ప్రణవ్, నవీన్, ఫరూక్, రెహన్, ఉమాదేవి నిలిచారు. ఈ పోటీలలో జిల్లా నలుమూలాల నుండి 100 మంది చెస్ క్రీడాకారులు హాజరయ్యారు. విజేతలను బహుమతులను విజ్‌డమ్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీష్ దర్బారి, చీఫ్ ఆర్బిటర్ శ్రీకాంత్ కోచ్ తథసుం అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అనీష్ దర్బారి

డాక్టర్ 'తవ్వా' ప్రతిభకు పట్టం

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి -కడప అర్బన్

బళ్లారి కల్చరల్ అసోసియేషన్ వారు నాటక సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులకు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు ఇవ్వడం ప్రశంసనీయమని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం బళ్లారి కల్చరల్ అసోసియేషన్, బళ్లారిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య ఆధ్వర్యంలో వెంకటయ్యకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వెంకటయ్య రాయలసీమ కథా సాహిత్యంపై పరిశోధన చేశారని, గతంలో ఎవరు పేర్కొనని, పరిశోధించని అనేక అంశాలను వెలుగులోకి తెచ్చి ఒక నూతన వరవడిని సృష్టించారని పేర్కొన్నారు. ఒక పరిశోధకునిగా తనేమిటో నిరూపించుకున్నారని చెప్పారు. తెలుగు సాహిత్య లోకంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. వెంకటయ్యకు ఈ పురస్కారం లభించడం సంతోషమని ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని, గౌరవ సలహాదారులు నరాల రామారెడ్డి, అలపర్తి పిచ్చయ్య చౌదరి, ఉపాధ్యక్షులు విద్వాన్ గానుగ పెంట హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డిశేఖర్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, సంయుక్త కార్యదర్శులు భూమిరెడ్డి స్వరూపారాణి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ జి వెంకట సాయి ప్రసాద్, డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ పొదిలి నాగరాజు, డాక్టర్ కోడూరు స్వతంత్ర బాబు వెంకటయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం పునరాలోచించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలని, పేద విద్యార్థులకు న్యాయం చేసేలా నిర్ణయం తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి)కు మెడికల్ సీట్లు నిర్వహణ చేయలేమని చేతులు ఎత్తివేయడంతో ఎంబిబిఎస్ చేయాలనే విద్యార్థులకు కల అలాగే మిగిలిపోయే ప్రమాదముందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి, అలా చేయకుండా ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో మెడికల్ సీట్లు భర్తీ చేయాలనే విధానంతో పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన 50 మెడికల్ సీట్లను నిర్వహించలేమని చెప్పడం శోచనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఇప్పటికే లాంగ్ టర్మ్ పేరుతో నీట్‌కు కోచింగ్‌లు తీసుకుంటూ లక్షల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారని అన్నారు. ఈ విధానం కారణంగా ఎంబిబిఎస్ సీట్లు మరింత ఖరీదు అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విధానం ప్రయివేటు మెడికల్ కళాశాలలకు లాభదాయకమని పేర్కొన్నారు. ఒకవైపు ఇతర రాష్ట్రాలు మెడికల్ కళాశాలలు, సీట్లు అధికంగా కేటాయించామని అడుగుతుంటే కూటమి ప్రభుత్వం వద్దు అనడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి మెడికల్ సీట్లు భర్తీకి చర్యలు చేపట్టాలని వెనక్కి పంపే నిర్ణయాన్ని పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

క్రీడాకారులు పోటీల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రీడా కారులు పోటీలలో రాణించాలని తేక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గీత, కార్య దర్శి విజయ భాస్కర్ పిలుపు నిచ్చారు. ఆదివారం వై ఎస్ఆర్ ఇండోర్ స్టేడి యంలో రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపడం ద్వారా దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకి, సొంత ఊరికి పేరు తెచ్చిన వారవుతారని తెలిపారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణలో మెలకువలు నేర్చుకోవడం ద్వారా ప్రతిభ చూపేందుకు వీలవుతుందని చెప్పారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధారుఢ్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణయి తలుగా కొన్నిపాటి వెంకటేష్, రాజశేఖర్, ఫాజిల్ బాష, రేవంత్ రెడ్డి, శ్రీకృష్ణ వంశీ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉదయ కుమార్, విజయలక్ష్మి, గోపి, క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన క్రీడాకారులు

కరాటే విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరానికి చెందిన జెన్స్ఫూరియా కరాటే స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వారిని ఆదివారం కడప ఎమ్మెల్యే మాధవి అభినందించి, శాలువాతో సత్కరించారు. ఈనెల 22న ముంబైలో షోటో ఖాన్ కరాటే అకాడమీ వారు నిర్వహించే ఇంటర్నేషనల్ మ్యాచ్‌కు 7 ఏళ్ల విభాగంలో నిషిత మైనస్ 20 కిలోల ఫైట్‌కు, 8 ఏళ్ల విభాగంలో తన్వితాక్షి, 9 ఏళ్ల బాయ్స్ క్యాటగిరిలో దక్షిత్ రెడ్డి, 10 ఏళ్ల విభాగంలో యక్షిత్ కుమార్, 11 ఏళ్ళ అమ్మాయిల విభాగంలో రాజ్యలక్ష్మి, 11 ఏళ్ల విభాగంలో అబ్దుల్లా ఖాన్, 11 ఏళ్ల విభాగంలో మేఘన, 12 ఏళ్ల విభాగంలో ఏంజెల్, 13 ఏళ్ల విభాగంలో మహిధర్ ఎంపికయ్యారు. ఈనెల 1న బెంగళూరులో నిర్వహించిన నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో దత్తు, రేణు వంశిక, శివ చందు ప్రియ, అయాన్ అమన్, హర్షవర్ధని, యశ్వంత్ కుమార్, ఫైటివెంట్లో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించారు. మెడల్ సాధించిన వారిని, కరాటే కోచ్ ఎం.విజయ్‌ను అభినందించారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పాల్గొన్నారు

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రంలోని రజకులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని రజక సంఘం కడప జిల్లా అధ్యక్షులు చేలో రవి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజకుల ముఖ్యమైన సమస్యలపై చర్చించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి మాట్లాడుతూ రజకుల ముఖ్యమైన సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దేశంలోని 17 రాష్ట్రాలలో రజకులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చారన్నారు. ఆయా రాష్ట్రాలలో రజకులు చట్టసభల్లో ఉన్నతమైన రాజకీయ పదవుల్లో, ఉన్నతాధికారులుగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందారన్నారు. రాష్ట్ర రజక కార్పొరేషన్ పాలకవర్గం వెంటనే ఏర్పాటు చేసి సమరులైన రజక వృత్తిదారులతో సంబంధాలు ఉన్న వ్యక్తులకే చైర్మన్, ఇతర పాలక వర్గం నియమించాలని కోరారు. రజక కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ రజక యువతకు రూ. 3 లక్షల వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. 50 సంవత్సరాలు వయసు దాటిన రజక వృత్తిదారులకు పెన్షన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లాండ్రీ షాపులకు సబ్సిడీ కరెంట్ విధానం అమలు చేయాలని, కొత్త దోబీ ఘాట్లకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న రజక వృత్తిదారులకు ఉచిత కరెంటు విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న దోబీఘాట్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కడప నగరంలోని ద్వారకా నగర్, రైతుబజార్ ప్రక్కన 50 సంవత్సరాలుగా దోబీఘాట్ ఉన్న స్థలంలోనే పునర్నిర్మాణం కోసం 2018లో రూ. 5.50 లక్షల నిధులు మంజూరు చేశారని, కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాక, సమీపంలోని స్థానికులు కోర్టు కెళ్లిస్టే తెచ్చుకోవడంతో పనులు నిలిచిపోయాయని వాపోయారు. స్టేను ఎత్తివేసి ఆ స్థలంలో రజకులకు కమ్యూనిటీ భవనాన్ని నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. కృష్ణమూర్తి, బి ఎరికలయ్య, హెచ్. ఆంజనేయులు , డాక్టర్ జి.పిచ్చయ్య, చెన్నప్ప, చింతకుంట శ్రీనివాసులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యర్లు చేలో రవి


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

టిడ్కో ఇళ్లు పంపిణీ చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు గూడెం చెరువులోని రాజీవ్ కాలనీ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం టిడ్కో అపార్ట్‌మెంట్స్‌ను జమ్మలమడుగు సిపిఎం కార్యదర్శి జి.ఏసుదాసు. సిపిఎం కమిటీ సభ్యులు దాసరి విజయ్ సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2015 టిడిపి ప్రభుత్వంలో ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని అప్పటి సిఎం చంద్రబాబునాయుడు దృఢ సంకల్పంతో గూడెం చెరువు ప్రాంతంలో 4404 ఇళ్లను మంజూరు చేయించి 2018 చివరిలోగా కొద్దిపాటి పెండింగ్‌తో పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇంతలోనే 2019లో ఎన్నికల కోడ్ రావడంతో పేదవారికి సొంత ఇంటి కల కలగానే మిగిలిపోయిందని వారు వాపోయారు. కనీసం వైసిపి ప్రభుత్వంలోనైనా ఇళ్లు వస్తాయని డబ్బులు కట్టి అర్జీలు పెట్టుకున్నా పేద మహిళలకు మొండి చేయి మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. పై పెచ్చు మహిళల పట్ల దురుసుగా మాట్లాడి బెదిరిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకో కపోవడంతో చేసేదేమీ లేక అర్జీదారులు సైలెంట్ అయ్యారని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం టిడ్కో ప్రాంతమంతా ముళ్లపొదలు పిచ్చి మొక్కలతో చిన్నపాటి అడవిని తలపించేలా ఉందని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి ఉపయోగంలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ధనంతో పేదల కోసం ఎంతో టెక్నాలజీతో నిర్మించిన టిడ్కో ఇళ్లకు విద్యుత్, తాగునీటి పైప్‌లైన్ కనెక్షన్లు, డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినయ్, బాషా పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులే

ప్రజాశక్తి - వేంపల్లె

జ్ఞాపకాలు ఎప్పటికీ మధురస్మృతులేనని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక తలిశెట్టి శేషమ్మ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1985-86 విద్య సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థిలైన షకీలా, రాజేశ్వరి, నాగవల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు అందరూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఉపాధ్యాయులు తమ పట్ల చూపిన అభిమానానికి పూర్వ విద్యార్థులు నమస్కార వందనంతో గౌరవించారు. ఆనాటి విధ్యార్థులకు చదువు చెప్పిన గురువులైన మంగమ్మ, సరస్వతమ్మ, శకుంతలమ్మ, సరోజమ్మకు దుస్తులు సమర్పించి పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ జీవితంలో స్నేహ బంధం అంత మధురమైందని చెప్పారు. స్నేహితులతో పంచుకున్న జ్ఞాపకాలను, గడిపిన మధురమైన క్షణాలను 38 ఏళ్ల తర్వాత మళ్ళీ ఒక్కసారి తలుచుకుని జీవితాలను సుసంపన్నం చేసుకునేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం సంతోషకరమని చెప్పారు. వివిధ రంగాలలో తమ స్నేహితులు మంచి హోదాలో ఉండడం, కొందరు స్వయం ఉపాధిలో, మరికొందరు ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాల్లో ఉండడం ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థినులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని సరదాగా గడిపి అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు సరళ, సరస్వతి, పద్మా, షకీల భాను, సుశీల, షాకీరా, శ్రీదేవి, రెడ్డెమ్మ, సుజాత, యల్లమ్మ, పద్మజ, గురుదేవి, వాసవి, రమాదేవి, సిద్దేశ్వరి, జయలక్ష్మి, లక్ష్మీదేవి, సరళ, సాయిలక్ష్మి, రమా నిరంజనమ్మ, ధనలక్ష్మి, అన్నపూర్ణ, గీతావాణి, ఆశ్రిఫున్ పాల్గొన్నారు.


కార్నియాలను అందజేస్తున్న పెద్దక్క కుటుంబ సభ్యులు

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపు వస్తుందని స్నేహిత అమృత సేవా సంస్థ అధ్యక్షులు రాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నల్లపు రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతాకు పెద్దక్క మరణించడంతో ఆమె కుమారులు రామాంజనేయులు, ప్రభాకర్, కుమార్తె మరియమ్మ, కోడళ్ళు పుష్పావతి, భార్గవి, అల్లుడు ప్రసాద్ నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ ,అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలు గ్రామానికి వెళ్లి పార్థివ దేహం నుంచి కార్నియా లను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణం తరువాత కూడా జీవించాలంటే, ఈ ప్రపంచాన్ని మళ్ళీ చూడాలని ఉంటే నేత్రదానం తోనే సాధ్యమని చెప్పారు. కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన తరువాత నేత్రదానం చేయదలచుకున్న వారు 9966509364,7093204537లలో సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను నల్లపురెడ్డిపల్లి గ్రామ నాయకులు, వైసిపి మండల కన్వీనర్ భాస్కర్ రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

వాహనాలను తనిఖీ చేసిన ఎస్ఐ

ప్రజాశక్తి - వేముల

స్థానిక కడప - పులివెందుల ప్రధాన రహదారి గొందిపల్లి క్రాస్ వద్ద ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ముందుగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలను, కార్లను ఆపి తనిఖీలు చేపట్టారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించొద్దని, పరిమితికి మించిన వేగంతో వెళ్లవద్దని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి ఈ చలానా విధించారు. కార్యక్రమంలో సిబ్బంది నూర్, మస్తాన్, పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై శ్రీరంగనాథుడు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో నూలు పూజ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత అయిన శ్రీ రంగనాథుడు హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణరాజేశ్‌శర్మ, ఉప అర్చకులు రాజసింహ, భూపాల్‌శర్మ, ఫణిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఇఒ కొట్టే వెంకటరమణ నేతృత్వంలో అవసరమైన సదుపాయాలు సమకూర్చారు.ఆర్య వైశ్యులు నూలుపూజ ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీ ప్రకారం తమ కుటుంబ సభ్యులతో కలిసివచ్చి స్వామివారిని దర్శించుకుని అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కెసి పరిధిలో ముమ్మరంగా వరినాట్లు

ప్రజాశక్తి - చాపాడు


సిద్ధారెడ్డిపల్లె వద్ద సాగైనా వరి పంట

మండల పరిధిలోని కెసి కాలువ నీటి ద్వారా వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అయ్యవారిపల్లె, తిమ్మాయపల్లె, రామదాసు పురం, రాజువారిపేట, తిప్పిరెడ్డిపల్లె, కుందూనది తీర గ్రామాలలో కుచ్చుపాప, రామసుబ్బమ్మ కొట్టాలు, సీతారామాపురం, చాపాడు గ్రామాల పరిధిలో వరి పంటను రైతులు సాగు చేశారు. జులై మెదటి వారం నుంచి వరినార్లు సాగు చేపట్టారు. ఆగస్టు మొదటి నుంచి వరి నాట్లు వేశారు. కెసి కాలువ పరిధిలోని సిద్ధారెడ్డిపల్లె, విశ్వనాధాపురం, సోమా పురం, బద్రిపల్లె, కేతవరం తదితర గ్రామాల్లో ఆగస్టు మెదటి వారంలో వరి నార్లు సాగు చేపట్టి, ఈనెలలో వరినాట్లు వేశారు. ప్రస్తుతం అక్కడక్కడా వరినాట్లు సాగు చేపడుతున్నారు. 13వేల ఎకరాల వరకు వరి పంట సాగైంది. కొంత మంది రైతులు మెదటి ధపా సతువలు కూడా చల్లుతున్నారు. కెసి కాలువకు త్వరగా నీరు విడుదల కావడంతో 13వేల ఎకరాలలో వరి పంట సాగు అయ్యే అవకాశం ఏర్పడింది. గత ఏడాది సరైన వర్షాలు లేక కెసి కాలువకు నీరు విడుదల కాకపోవడంతో ఆరుతడి పంటలకే పరిమితం కావాల్సి వచ్చింది. కుందూ, పెన్నా పరిధిలో కేవలం 3వేల ఎకరాల మాత్రమే వరి పంట సాగైంది. మిగిలిన రైతులు జొన్న, మొక్కజొన్న, మినిము వంటి పంటలకు పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం బెంగాల్, బీహార్ వంటి ప్రాంతాల నుంచి వలస కూలీలు రావడంతో వరి నాట్లు త్వరగా పూర్తయ్యాయని రైతులు పేర్కొంటున్నారు.

చంద్రబాబు నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు అన్యాయం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రబాబు ప్రభుత్వ అసమర్థత, చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగా 2024- 25 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 700 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు కాలేదని, దీంతో పేద విద్యార్థులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి మండిపడ్డారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె, మార్కాపురం, ఆదోని, పులివెందుల, పాడేరు మెడికల్ కళాశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఉంటే ఒక్కొక్క కళాశాలకు 150 ఎంబిబిఎస్ సీట్లు చొప్పున 750 సీట్లు వచ్చి ఉండేవని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించని కారణంగా జాతీయ మెడికల్ కమిషన్ ఒక్క పాడేరు మెడికల్ కళాశాలకు మాత్రం 50 సీట్లు కేటాయించిందని చెప్పారు. పాడేరు మెడికల్ కళాశాలకు 50 శాతం నిధులు కేంద్రం భరిస్తుంది కాబట్టి ఆ మేరకైనా 50 సీట్లు వచ్చాయని చెప్పారు. పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం వైఖరి గర్హనీయమని చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి 50 సీట్లు కేటాయిస్తూ ఈ ఏడాది ఆగస్టు 16న జాతీయ మెడికల్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి పత్రం ఇచ్చిందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ఈ మెడికల్ కళాశాలను నిర్వహించలేమని చంద్రబాబు ప్రభుత్వం ఈనెల 10న ఎన్ఎంసికి లేఖ రాసిందని తెలిపారు. దీంతో 2024 సెప్టెంబర్ 11న ఎన్ఎంసి అనుమతి పత్రాన్ని ఉపసంహరించుకుందని చెప్పారు. దేవుడు వరమిస్తే పూజారి అడ్డుకున్నట్లుంది చంద్రబాబు ప్రభుత్వం నిర్వాకం అన్నారు. ఏ ప్రభుత్వం ఇలా చేయదని కూటమి ప్రభుత్వానికి సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ అసమర్థతకు ఇది పరాకాష్ట అన్నారు. పులివెందులపై, కడప జిల్లాపై కక్ష కట్టడం శోచనీయం అన్నారు. వెంటనే అండర్ టేకింగ్ లేఖ ఎన్ఎంసికి ఇచ్చి 50 సీట్లతో ఈ విద్యా సంవత్సరం లోనే పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

వినూత్న ఆవిష్కరణలకు ప్రసిద్ధి 'జీనోమిక్స్ బయోటెక్'

- సిఇఒ రత్నగిరి పొలవరపు



అవార్డును అందుకుంటున్న శాస్త్రవేత్త డాక్టర్ వినయ్‌చంద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆరోగ్య సంరక్షణ మెరుగుదల కోసం వినూత్న ఆవిష్కరణలను తమ జీనోమిక్స్ బయోటెక్ ద్వారా అందిస్తున్నామని జెనోమిక్స్ ప్రెసిడెంట్, సిఇఒ రత్నగిరి పొలవరపు తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ తాము ఐవిఆర్ఐతో కలిసి కోళ్ల వ్యాధులపై చేసిన పరిశోధనలకు గాను బిఐఆర్ఎసి డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ భారత ప్రభుత్వ ఇన్నోవేటర్ అవార్డును అందజేసిందని తెలిపారు. ఈ అవార్డును డిబిటిసి సెక్రెటరీ రాజేష్ సుధీర్ గోఖలే చేతుల మీదుగా అందుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో తమ జీనోమిక్స్ బయోటెక్ ద్వారా మరిన్ని పరిశోధనలు చేస్తామన్నారు. 2003లో జీనోమిక్స్ బయోటెక్ అత్యాధునిక పరిశోధన కేంద్రాన్ని స్థాపించామన్నారు. నాటి నుంచి తాము జీనోమిక్స్ మాలిక్యులర్ డయాగ్నొస్టిక్ ప్రయివేట్ లిమిటెడ్, జీనోమిక్స్ హెల్త్ కేర్ ఆఫ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, జెనోమిక్స్ కార్ల్ ప్రైవేట్ లిమిటెడ్ వంటివి ప్రభుత్వ, ప్రయివేట్ సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం ద్వారా పులివెందులలో జీనోమిక్స్‌కార్ల్ ప్రయివేట్ లిమిటెడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. తమ పరిశోధన కేంద్రం మానవ ఆరోగ్య అవసరాలకు సంబంధిత వ్యాధిని గుర్తించే కిట్లను కూడా అందిస్తోందన్నారు. మరి ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ, హెచ్ఐవి, హెచ్‌సివిలతోపాటు జంతువుల ఆరోగ్య అవసరాలకు సంబంధించిన బ్రూస్ సెల్లో సిస్, టిబి, ఫుట్ అండ్ మౌత్ డిసీస్ వంటి వ్యాధి నిర్ధారణ కిట్లను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. 2018లో ఎన్ఆర్‌సిఇ వారి సహకారంతో దేశంలోనే ఏకైక గ్లాండర్స్ వ్యాధి నిర్ధారణ కిట్‌ను కనుక్కున్నారని చెప్పారు. కరోనా సమయంలో కూడా వ్యాధి నిర్ధారించడానికి కావాల్సిన కిట్లను అభివృద్ధి చేసి కర్నూల్లో ల్యాబ్ ఏర్పాటు చేసి అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించామని చెప్పారు. మా జీనోమిక్స్ బయోటెక్ పరిశోధన కేంద్రం ఆధునిక పశువుల పరిశోధన మరియు జంతువుల ఆరోగ్యం, ఉత్పాదకతను మెరుగుపరచడానికి పరిష్కారాలపై దృష్టి పెడుతుందని తెలిపారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన జనాభాకుత పరిశోధన కేంద్రం మద్దతు ఇస్తుందన్నారు. భవిష్యత్తులో జీనోమిక్స్ బయోటిక్ పరిశోధన కేంద్రం ద్వారా ప్రజా పరిరక్షణకు దోహదపడతామని తెలిపారు. సందర్భంగా అవార్డును అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



శాస్త్రవేత్తలతో పులివెందులకు చెందిన వినయ్

వైద్య విద్యా విధానానికి తూట్లు : మాజీ ఎమ్మెల్యే


రద్దు పత్రాన్ని ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుడితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీటిని నిర్వహించే శక్తి తమ ప్రభుత్వానికి లేదని, రద్దు చేయాలని లేఖ రాసి వైద్య విద్యావిధానానికి తూట్లు పొడుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి వాపోయారు. స్థానిక వైసిపి నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత రద్దు చేయమని కోరుతూ చంద్రబాబు రాసిన లేఖను సమావేశంలో ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొట్టతొలుత 1923లో విశాఖపట్నంలో ఆంధ్రమెడికల్ కళాశాల ఏర్పాటు అయిందని అప్పటి నుండి జగన్ పాలనకు ముందు వరకు 37 మెడికల్ కళాశాలలు ఏరాటయ్యాయని పేర్కొన్నారు. ఒక్క జగన్ హయాంలోనే 17మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారన్నారు. వీటిలో 5 కళాశాలల్లో 750 సీట్లతో నడుస్తున్నాయన్నారు. మిగిలిన 12 కళాశాలల ద్వారా బాబు పుణ్యమా అని 1800 సీట్లు కోల్పోతున్నామన్నారు. చంద్రబాబుకు, లోకేష్‌కు, ఆయన మనవడు దేవాంశ్‌కు రాష్ట్ర ప్రజలు మంచి భవిష్యత్తునిస్తే ఇక్కడి బిడ్డల భవిష్యత్తును వారు అంధకారం చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు ప్రయివేట్ పరమైతే తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందన్నారు. జగన్ హయాంలో వెయ్యి పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్ ప్రవేశపెటితే ఆ విద్యావిధానాన్ని బాబు రద్దు చేశారన్నారు. విద్యావిధానంలో తెలంగాణ ప్రభుత్వం దూసుకుపోతుంటే మనం వెనకబడిపోతున్నామని వాపోయారు. పోరాటంలో ప్రజలు మద్దతివ్వాలని రాచమల్లు కోరారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి,కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఛైర్మన్‌గా నంద్యాల రాజశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

బహుళార్థ పశువైద్య శాలలో ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వేటేరి నెరియన్స్ ఫెడరేషన్ వైఎస్ఆర్ జిల్లా ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా ఛైర్మన్‌గా నంద్యాల రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ఛైర్మన్ బి.సేవా నాయక్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖ ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులన్నీ వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నటువంటి కార్యాలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాఘవరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా జయపాల్, అసోసియేట్ అధ్యక్షులుగా వీరకుమార్, ఉపాధ్యక్షులుగా సి.వెంకటేశ్వరి, శివానంద్, పి.సుజాత, కార్యదర్శి సి.గణేష్ సంయుక్త కార్యదర్శిగా ఎం.హిమబిందు, బి.శ్యామ్ రాజు, కోశాధికారిగా వి.శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా బి.గోవిందరాజు, ప్రధాన కార్యదర్శిగా వై. వి.ఎస్. ప్రసాద్, సహాయ ఎన్నికల అధికారిగా జి. గోపి, అధ్యక్షులుగా వి.వెంకట సుబ్బయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.మహదేవ, ఉపాధ్యక్షులుగా పి.సునీల్ కుమార్, ఎం. మోహన్ సాయి, కార్యదర్శి కె.ఖాదర్ బాబు, సంయుక్త కార్యదర్శిగా షాహిదా బేగం, కె.రమేష్, కోశాధికారి సాల్మోన్ రాజు, ఎన్నికల కమిటీ సభ్యులుగా గా పి. శిరీష, టి.మానసను ఎన్నుకున్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ సంఘంకు ఎన్నికల అధికారిగా ఆర్. విజయ సారధి అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఎం. శీనయ్య వ్యవహరించారు.


నివాళులు అర్పిస్తున్న నాయకులు

'ఏచూరి' మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఏచూరి మరణం వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు విపి బయన్న మాట్లాడుతూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో 23 రోజులుగా చికిత్స తీసుకుంటూ మృతిచెందారని చెప్పారు. ఆయన మరణానికి ఎర్రగుంట్ల మండల అఖిలపక్ష పార్టీలు, ప్రజా సం ఘాలు ఘన నివాళులు లాల్ సలాంతో సెల్యూట్ తెలుపుతుందన్నారు. దేశంలో కార్పొరేట్ల దోపిడీకి సహకరిస్తున్న ప్రభుత్వాల విధానాలను ఎప్పటికప్పుడూ చట్టసభల్లో, బయట ఆయన గొంతు వినిపిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో ప్రముఖ పాత్ర వహించారని చెప్పారు. మార్క్సిస్ట్ మేధావిగా గుర్తింపు పొందారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అన్వేష్, సిపిఐ నాయకులు ఓబుల్‌రెడ్డి, రామ్మోహన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, ఓబయ్య, ఆర్‌టిపిపి కార్మిక నాయకులు, వెన్నపూస సుబ్బిరెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు జి.సి కుళాయి రెడ్డి, మాల మహానాడు నాయకులు రాజు, అంబేద్కర్ ఫోరం నాయకులు సుభాష్, మైనార్టీ నాయకులు హుస్సేన్ బాష, సీనియర్ జర్నలిస్టు బాష, మహేష్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ సాంబశివుడు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల అధ్యక్షులుగా చొక్కమ్ శివ

ప్రజాశక్తి - మైదుకూరు : పట్టణంలోని రేషన్ డీలర్ల అసోసియేషన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షులుగా పట్టణంలోని 42వ రేషన్ షాపు నిర్వాహకుడు చొక్కమ్ శివ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా షేక్ నూర్ మహ మ్మద్, ప్రధానకార్యదర్శిగా శివారెడ్డి, కోశాధికారిగా నాయాబ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ డీలర్ల సమస్యల గురించి ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


వినాయకుడిని ఊరేగిస్తున్న ప్రజలు

ఘనంగా గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి - వేంపల్లె

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలకు 9 రోజుల పాటు పూజలు చేసిన అనంతరం విగ్రహాలను ఘనంగా ఊరేగింపు చేపట్టారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాలలో, కాపు వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వేంపల్లెలోని పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. వినాయక ఊరేగింపులో డప్పులు, మేళతాళాలు, డిజె పాటలు, కోలాటాలు, విచిత్ర వేషధారణలు, టపాసులు పేల్చుతూ.. ' జై బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ' రంగులు చల్లుకొంటూ యువత కేరింతలు కొట్టారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపులో శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడంతో పలువురికి ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో ప్రజలకు ప్రసాదం పంపిణీ చేశారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

శిల్పారామం కళావేదికపై ఆదివారం సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సినీ, జానపద, శాస్త్రీయ గీతాలకు ప్రదర్శన చేశారు. కార్యక్రమాలను శిల్పారామం ఎఒ శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.


నృత్యాలు చేస్తున్న చిన్నారులు